సాక్షి ఒడిశా

శనివారం । 8 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,03,802లు, బంగారం 700 మిల్లీగ్రాములు, వెండి 126.85 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఊరూరా వన మహోత్సవాలు

- 8లో



అవినీతిపై ఉక్కుపాదం

- 8లో

న్యూస్‌రీల్

పాలిథిన్ నిషేధంపై ప్రచారం



పాలిథిన్ నిషేధంపై రూపొందించిన పోస్టర్

జయపురం: పట్టణంలో పాలిథిన్ వినియోగంపై మున్సిపాలిటీ యంత్రాంగం నిషేధం విధించింది. ప్లాస్టిక్ పునర్వినియోగం, 1200 మైక్రాన్ కంటే తక్కువ మందం ఉన్న కవర్ల వినియోగంపై నిషేధం కఠినంగా కొనసాగిస్తున్నట్లు జయపురం మున్సిపాలిటీ ఈఓ సిద్ధార్థ పట్నాయక్ వెల్లడిచారు. ఈ మేరకు పట్టణంలో ప్రచారం చేస్తున్నామన్నారు.


బీజేపీ కార్యవర్గ సమావేశం



పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నారాయణరావు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పర్లాకిమిడి మున్సిపాలిటీ పరిధిలోని నాయకులు, కౌన్సిలర్లతో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు శుక్రవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. సమావేశంలో కాశీనగర్ సమితి మాజీ అధ్యక్షుడు ఛిత్రి సింహాద్రి, జిల్లా సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, నాయకులు దారపు రాజేష్‌కుమార్, ప్రశాంత్‌కుమార్ పాలో, కౌన్సిలర్లు బాలకృష్ణ పాత్రో, జిల్లా కార్యదర్శి ఈ.ప్రశాంత్, జెట్పీటీసీ మాజీ సభ్యుడు గేదెల శ్రీధరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేడీ ఉపాధ్యక్షుడిగా నెక్కంటి



నెక్కంటి భాస్కరరావు

రాయగడ: బీజేడీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడిగా మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యాలయం(భువనేశ్వర్) శుక్రవారం ప్రకటన వెల్లడించింది. గత 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో నెక్కంటి అంచెలంచెలుగా ఎదుగుతూ పార్టీ అభివృద్ధికి సేవలందించారు. ఆయన సేవలను గుర్తించిన అధిష్ఠానం గతంలో వివిధ కార్పొరేషన్ సంస్థలకు చైర్మన్లుగా నియమించింది. నవీన్ నాయకత్వాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలో నిర్విరామంగా కృషి చేస్తున్న నెక్కంటిని రాష్ట్రస్థాయి కార్యవర్గంలో ఉపాధ్యక్ష పదవిని ఇచ్చి గౌరవించడంతో స్థానిక బీజేడీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను కలిసి, అభినందనలు తెలియజేశారు.

10 తులాల బంగారం చోరీ



ఇంట్లో చిందర వందరగా పడి ఉన్న సామగ్రి

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్ పరిధి సిరిజోలి గ్రామంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఇంటి తలుపులు విరగ్గొట్టి, లోపలకు చొరబడ్డారు. బీరువాలోని 10తులాల బంగారు ఆభరణాలు, రూ.20,700ల నగదు దోచుకున్నారు. ఈ మేరకు బాధితురాలు నిర్మళా పాత్రో ఫిర్యాదు చేశారు. కుటుంబమంతా కలిసి సమీపంలోని బుదురా గ్రామంలో ఉన్న తమ బంధువుల ఇంటికి బుధవారం వెళ్లామని ఆమె తెలిపారు. శుక్రవారం ఉదయం తిరిగి వచ్చి చూడగా, తలుపులు విరగ్గొట్టి ఉన్నాయని పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీబీఐ అదుపులో ముగ్గురు

- బహనాగా బజార్‌లో రైలు ప్రమాద దర్యాప్తులో ముందడుగు
- ముగ్గురు రైల్వే సిబ్బందిని అరెస్ట్ చేసిన అధికారులు
- నిందితులకు వ్యతిరేకంగా క్రిమినల్ కేసులు నమోదు





భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వేస్టేషన్ సమీపంలో 3 రైళ్లు ఢీకొన్న విషాద ఘటనపై దర్యాప్తు చేస్తున్న సీబీఐ(సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) మరో ముందడుగు వేసింది. భారతీయ రైల్వే చరిత్రలో ఘోరమైన విషాదాల్లో ఒకటైన జూన్ 2న చోటు చేసుకున్న ఈ ప్రమాదంపై చేపట్టిన విచారణలో భాగంగా ప్రమాదానికి కారణంగా ముగ్గురు రైల్వే అధికారులను గుర్తించారు. ఈ మేరకు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేశారు. వీరిలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్ అరుణ్‌కుమార్ మొహంతా, సెక్షన్ ఇంజినీర్ మహ్మద్ అమీర్‌ఖాన్, టెక్నీషియన్ పప్పు కుమార్ ఉన్నారు. ముగ్గురిపై సీఆర్‌పీసీ 304, 201 సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేశారు. అంతేకాకుండా, వారు సాక్ష్యాలను దాచడానికి ప్రయత్నించారని నివేదికలో పేర్కొన్నారు. ఢీకొన్న ఘటనలో అత్యంత వేగంగా దూసుకు వచ్చిన కోల్‌కతా–చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్(12841) అప్పటికే గూడ్స్ రైలు నిలిచి ఉన్న బహనాగా బజార్ రైల్వేస్టేషన్ సమీపంలో అప్ లూప్‌లైన్ లోకి ప్రవేశించింది. రెప్పపాటులో ఊహించని ఘోరం జరిగిపోయింది. గూడ్స్ రైలుని కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని, పక్కనే మరో ట్రాక్‌పై పడ్డాయి. ఈ క్రమంలో బెంగళూరు–హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు చివరి బోగీలను ఢీకొన్నాయి. ఇలా రెండు రైళ్లలో ప్రయాణికులు విపరీతంగా ప్రభావితమయ్యారు. ఘోర ప్రాణహాని చోటు చేసుకోవడంతో పలువురు కోలుకోలేని దయనీయ స్థితిలో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

సవివరంగా సీఆర్‌ఎస్ నివేదిక..

ఈ ప్రమాదంపై దర్యాప్తును తొలుత రైల్వే భద్రతా కమిషనర్(సీఆర్‌ఎస్)కి, అనంతరం సీబీఐకి అప్పగించారు. ఆగ్నేయ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ ఏఎం చౌదరికి ఆధ్వర్యంలో సీఆర్‌ఎస్ విచారణ కొనసాగింది. విచారణ సమగ్ర నివేదికను ఇటీవల రైల్వే బోర్డుకు సమర్పించారు. దీని ప్రకారం సిగ్నల్, టెలీకమ్యూనికేషన్(ఎస్‌అండ్‌టీ) విభాగంలో బహుళ స్థాయిలలో లోపాలను ఎత్తి చూపారు. ప్రమాదానికి ఎస్‌అండ్‌టీ విభాగానికి చెందిన సిబ్బందే బాధ్యులుగా స్పష్టం చేశారు.

అమీర్‌ఖాన్ ఇంటిపై దాడులు..

బాలాసోర్ జిల్లా సారో ప్రాంతంలో సెక్షన్ ఇంజినీర్ మహ్మద్ అమీర్‌ఖాన్ అద్దెకు ఉంటున్న ఇంటిపై సీబీఐ అధికారులు దాడులు చేసి విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా బహనాగా బజార్ స్టేషన్ మాస్టర్ ఎస్‌పీ మహంతిని ప్రశ్నించారు. రైల్వే బోర్డు సిఫార్సు మేరకు ప్రభుత్వ రైల్వే పోలీసు(జీఆర్‌పీ) నుంచి దర్యాప్తు బాధ్యతను కేంద్ర దర్యాప్తు బృందం సీబీఐ చేపట్టింది. మరోవైపు ఈ విషాద ఘటనలో 293మంది మరణించగా, 1,200మంది గాయపడ్డారు. పలువురి మృతదేహాలు భువనేశ్వర్ ఎయిమ్స్ ప్రాంగణంలో బంధువర్గాల కోసం నిరీక్షణలో ఉన్నాయి. దుర్ఘటనలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు లోకో పైలెట్లు ముందంజ క్షతగాత్రులుగా మిగిలి పోయారు. వీరి ఆరోగ్య పరిస్థితి ఊగిసలాడుతోంది. ఈ నేపథ్యంలో రైల్వేశాఖ స్పందన ఇంత వరకు స్పష్టం కాలేదు.

పులి మాంసం రుచి చూద్దామని..!



అటవీశాఖ అధికారుల అదుపులో రైకియా గ్రామస్తులు

- అటవీశాఖ అధికారులకు పట్టుబడిన 13మంది నిందితులు

బరంపురం: కొందమాల్ జిల్లా బల్లిగుడా రేంజ్, తుమ్మిదిబందో పోలీస్ స్టేషన్ పరిధిలోని రైకియా అటవీ ప్రాంతంలో పులిని వేటాడి హతమార్చి, మాంసం తిందామనుకున్న 13మంది ప్రబుద్ధులను అటవీశాఖ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. బల్లిగుడ అటవీ ప్రాంతంలో రైకియా గ్రామస్తులు బుధవారం రాత్రి ఉమ్మడిగా పులిని వేటాడారు. అనంతరం గ్రామం సమీపంలోని తోటలో అంతా కలిసి వాటాలు వేసుకున్నారు. ఇంటికి తీసుకు వచ్చి, కమ్మగా వండుకున్నారు. ఎట్టకేలకు.. పులి మాంసం రుచి చూద్దామనుకొని సిద్ధమవుతున్న సమయంలో విషయం బయటకు పొక్కడంతో అటవీశాఖ, పోలీసులు అధికారులు దాడి చేశారు. ఈ మేరకు 13మంది గ్రామస్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి పులి చర్మం, గోళ్లు, ఇతర అవయవాలు, వండిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే పులి వయస్సు, బరువు ఇతర వివరాలేమీ తెలియలేదు .ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జింక మాంసం.. కిలో రూ.1500లు



రాయగడ: అటవీశాఖ అధికారుల అదుపులో నిందితులు

రాయగడ: రాయగడ రిజర్వ్ ఫారెస్ట్‌లో జింకను వేటాడి, మాంసాన్ని విక్రయిస్తుండగా అటవీశాఖ అధికారులు దాడులు చేపట్టారు. ఈ మేరకు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఆశాఖ డిప్యూటీ రేంజర్ సంజయ్‌కుమార్ సాహు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయగడ సమీపంలోని మానిక్‌జోల గ్రామంలో జింక మాంసం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో అటవీశాఖ అధికారి గౌరీశంకర్ సాహు, గార్డు సంతోష్ పాణిగ్రాహి, సిబ్బంది దాడులు నిర్వహించారు. పితామహల్ గ్రామానికి చెందిన మాధవ ఉలక(43), మానిక్‌జోలకు చెందిన మాధవ ఉలక(41) వేటాడి తెచ్చిన జింక మాంసాన్ని గ్రామంలో కిలో రూ.1,500ల చొప్పున విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో అధికారులు దాడులు నిర్వహించారు. నిందితుల్లో కొంతమంది పరారు కాగా, ఇద్దరు పట్టుబడ్డారు. దీనిపై కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరు పరిచారు. వారినుంచి 3కిలోల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు.

చిలికాలో నావల్ పాసింగ్‌ఔట్ పరేడ్



గౌరవ వందనం స్వీకరిస్తున్న సౌత్ నావల్ కమాండర్ వైస్ అడ్మిరల్ ఏఆర్ కార్వే

- ఆకట్టుకున్న శిక్షణార్థుల విన్యాసాలు

బరంపురం: నగరానికి సమీపంలోని చిలికా సరస్సు తీరంలో ఉన్న నావికా విభాగం ఐఎన్‌ఎస్ చిలికాలో పాసింగ్‌ఔట్ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కొచ్చిన్‌కు చెందిన సౌత్ నావల్ కమాండర్ వైస్ అడ్మిరల్ ఏఆర్ కార్వే ముఖ్య అతిథిగా పాల్గొని, నావికాదళ జెండాను ఆవిష్కరించారు. ఐఎన్‌ఎస్ చిలికాలో ఇండియన్ నావల్, కోస్టుగార్డ్‌పై దేశవ్యా ప్తంగా 2,707 మంది యువకులకు గత 21 వారాలుగా అందిస్తున్న శిక్షణ పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో చేపట్టిన పాసింగ్ ఔట్ ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పరేడ్, వివిధ విన్యాసాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాలు ఈనెల 18 వరకు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో రూరల్ బూరియా సీనియర్ సెకండరీ రిక్రూట్ అధికారి నవీన్‌కుమార్ నాయక్, జనరల్ డ్యూటీ అధికారి గౌరవ్ దీక్షిత్ నాయక్, ఆకాష్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.


నవోదయ విద్యార్థిని కేసులో పునర్విచారణ

పర్లాకిమిడి: జిల్లా కేంద్రానికి సమీపంలోని బెత్తగుడ జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థిని సాధామిని రైతో అనుమానాస్పద మృతిపై భువనేశ్వర్ నుంచి వచ్చిన నలుగురు సభ్యుల క్రైం బ్రాంచ్ అధికారులు శుక్రవారం పునః దర్యాప్తు చేపట్టారు. స్థానిక జేఎన్‌వీ క్యాంపస్‌లో విచారణ జరిపారు. విద్యార్థిని స్నేహితులు, ఉపాధ్యాయులు తెలిపిన వివరాలను రికార్డు చేశారు. కాశీనగర్ సమితికి చెందిన సౌధామిని.. 3నెలల క్రితం విద్యాలయ వసతిగృహంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందింది. స్థానిక పోలీసులు దీనిపై ముందుగా ఆత్మహత్యకు పాల్పడినట్లు కేసు నమోదు చేశారు. అయితే ప్రిన్సిపాల్, సిబ్బంది పొంతన లేని సమాధానాలు చెప్పడంతో విద్యార్థిని కుటుంబీకుల్లో అనుమానాలు చెలరేగాయి. మరోసారి దర్యాప్తు చేయాలని పోలీసులను కోరగా, వారు స్పందించక పోవడంతో మృతురాలి తల్లి, బంధువులు, కమ్యూనిస్టు నాయకులు ఇటీవల కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలకు దిగారు. దీనిపై స్పందించిన ఎస్పీ స్వాతీ ఎస్.కుమార్ క్రైం బ్రాంచితో దర్యాప్తుకు ఆదేశించారు. ఈ మేరకు ఆశాఖ అధికారులు పునః విచారణలో భాగంగా స్థానిక క్యాంపస్‌ను రెండోసారి సందర్శించారు.



విద్యార్థిని తల్లితో చర్చిస్తున్న ఎస్పీ స్వాతి ఎస్.కుమార్(ఫైల్ ఫొటో)

పలువురు ఐపీఎస్ అధికారులకు బదిలీలు



భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ కేడర్‌లో స్వల్ప మార్పులు చేసింది. ఈ మేరకు హోంశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిప్రకారం... ప్రస్తుతం ఐజీపీగా ఉన్న 2003 బ్యాచ్ ఐపీఎస్ అధికారి మానవ హక్కుల పరిరక్షణ సెల్(హెచ్‌ఆర్‌పీసీ) కె.షెఫీన్ అహ్మద్ సీఐడీ, క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా నియమితులయ్యారు. 2007 బ్యాచ్ అధికారి హెడ్‌క్వార్టర్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీఐజీపీ) సార్థక్ షడంగి ఫైర్ సర్వీసెస్, హోంగార్డ్ విభాగానికి బదిలీ అయ్యారు. కంప్యూటర్ విభాగం డీఐజీపీగా బాధ్యతలు వహిస్తున్న 2008 బ్యాచ్ అధికారి సత్యజిత్ నాయక్ మానవ హక్కుల పరిరక్షణ సెల్(హెచ్‌ఆర్‌పీసీ) డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం కటక్‌లోని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పని చేస్తున్న 2011 బ్యాచ్ అధికారి జుగల్‌కిషోర్ బానోత్ ప్రధాన కార్యాలయంలో ఏఐజీపీగా బదిలీ అయ్యారు. 2015 బ్యాచ్ ఐపీఎస్ అధికారి రాహుల్‌జైన్ నయాగడ్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా నియమితులయ్యారు. ఇంతవరకు ఆయన హెడ్‌క్వార్టర్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు నిర్వహించారు. వీరితో ఒడిశా పోలీసు సర్వీస్(ఓపీఎస్) అధికారి మిహిర్‌కుమార్ పండా పదోన్నతి సాధించారు. భువనేశ్వర్–కటక్ కమిషనరేట్ పోలీస్ స్పెషల్ క్రైం యూనిట్ డీసీపీగా పని ఉన్న ఆయన.. కటక్ ఎస్పీగా నియమితులైనట్లు ఉత్తర్వులు పేర్కొన్నాయి.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

బరంపురం: బరంపురం జిల్లా పోలీసు పరిధిలోని పితతోలి గ్రామంలో జరిగిన మాజీ సర్పంచ్ ఎ.కామేశ్వర్‌రెడ్డిపై హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసుల 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. ఎస్‌డీపీఓ శివశంకర్ మహాపాత్రో అందించిన సమాచారం ప్రకారం ఈనెల 6న గంజాం జిల్లా చికిటి బ్లాక్ గొళంతరా పోలీసు స్టేషన్ పరిధి పితతోలి గ్రామ సర్పంచ్ ఎ.రామరావు అల్లుడు, బీజేడీ నాయకుడు, మాజీ సర్పంచ్ కామేశ్వర్‌రెడ్డిపై ప్రత్యర్థివర్గం వారు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడిక్కడే మృతిచెందారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరంతా అదే గ్రామానికి చెందిన ఎస్.కనకయ్య, కె.పోలయ్య, కె.నర్సింహమూర్తిగా వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరు పరిచిన అనంతరం జైలుకి తరలించామని ఎస్‌డీపీఓ వివరించారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: 5టీ పథకంలో పాఠశాలల సర్వాంగ ఉన్నతికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు సద్వినియోగించడంతో పాటు త్వరితగతిన పనులు పూర్తి చేయాల ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి సూచించారు. జయపురం మున్సిపాలిటీ లోని చందనబెడ మున్సిపల్ ఉన్నత పాఠశాలను 5టీ పథకంలో చేర్చిన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పాఠశాల ఆధునికీకరణ, సౌకర్యాలు కల్పించేందుకు 5టీ విభాగం రూ.38 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. ఈ మొత్తాన్ని సద్వినియోగం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, ఈఓ సిద్ధార్థ పట్నాయక్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు



దివ్యాంగ చిన్నారికి పింఛన్ అందిస్తున్న దృశ్యం

- ఖొయిర్‌పూట్ సమితిలో ఎన్‌సీపీసీఆర్ ప్రత్యేక శిబిరం

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖొయిర్‌పూట్ సమితిలో జాతీయ బాలలల హక్కుల పరిరక్షణ కమిషన్ బృందం శుక్రవారం పర్యటించింది. ఈ సందర్భంగా ఖొయిర్‌పుట్ ఉన్నత పాఠశాల వద్ద ప్రత్యేక శిబిరం నిర్వహించారు. బాలల హక్కుల ఉల్లంఘనకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారంలో భాగంగా స్వచ్ఛంద సంస్థలు అందజేసిన 456 ఫిర్యాదులున స్వీకరించారు. ఇందులో 33 వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీపీసీఆర్ రిజిస్ట్రార్ అనూ చౌదరి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని గుర్తుచేశారు. కార్యక్రమంలో భాగంగా దివ్యాంగ చిన్నారులకు వీల్‌చైర్లు–6, సెరిబ్రల్ కుర్చీలు–2, ట్రై సైకిళ్లు–2, వినికిడి యంత్రాలు–7, దివ్యాంగ పింఛన్లు 16మందికి అందజేశారు. మరికొంత మందికి ఆధార్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్‌లు తెరిచేందుకు ఏర్పాట్లు చేశారు. శిబిరానికి వచ్చిన చిన్నారులకు దివ్యాంగ ధ్రువపత్రాలు అందించడంతో పాటు, ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యదర్శి ప్రభత్‌కుమార్ సాహు, మల్కన్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ మహేశ్వర్‌చంద్ర నాయక్, జిల్లా సంక్షమాధికారి సంజుక్త ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల నుంచి ఫిర్యాదులు ఆలకిస్తున్న అనూ చౌదరి

మాబుడి ఠకురాణి ఆలయ అభివృద్ధికి చర్యలు

- రూ.18.91 కోట్ల వ్యయ ప్రణాళికకు సీఎం ఆమోదం
- 5టీ కార్యచరణలో సుందరీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు



మాబుడి ఠకురాణి



సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: గంజాం జిల్లా వాసుల ఆరాధ్యదైవం బరంపురం మాబుడి ఠకురాణి. ఒడిశాతో పాటు ఆంధ్రప్రదేశ్ లోని పరిసర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో ఆలయ అభివృద్ధి, పరివర్తన కోసం సిద్ధం చేసిన ప్రత్యేక ప్రణాళికను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆమోదించారు. రూ.18.91 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో రాష్ట్రప్రభుత్వం 5టీ కార్యచరణ కింద అభివృద్ధి పనులు చేపట్టనుంది. నిర్ణీత గడువులోగా ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంఓ) తెలిపింది. అమ్మవారు కొలువుదీరిన ఆలయాన్ని సరికొత్త రూపురేఖలతో విస్తరించాలని సంకల్పించడం విశేషం. ఈ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక పనులు కళింగ నిర్మాణ శైలిలో చేపడతారు. పనుల్లో భాగంగా యజ్ఞకుండం, ఆలయ కార్యాలయ భవనం, సరిహద్దు గోడ, ఉద్యానవనం, సుందరమైన ప్రవేశ ద్వారం తదితర వాటితో సుందరీకరించనున్నారు. చేతులు కడుగుకునేందుకు ప్రత్యేక సౌకర్యం, బహుళార్ధ ప్రయోజనాలకు ఉపయోగపడే రీతిలో మౌలిక సదుపాయాలతో సువిశాల ప్రాంగణం నిర్మిస్తారు. ఈ ప్రాంగణం వివిధ కార్యక్రమాలకు ఉపయోగపడుతుంది. ఆలయ అందాన్ని పెంచేందుకు విద్యుద్దీపాల మిరమిట్లతో ఆబాలగోపాలం, సందర్శకులు, పర్యాటకులను ప్రత్యేకంగా ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతారు. అమ్మవారి అర్చకులు, సేవకుల కోసం ప్రత్యేక గది, ప్రసాదాలు, నైవేద్యాల వంటకాల కోసం పోటు, నిత్య, ఉత్సవ నైవేద్యం సమర్పణకు భోగమండపం నిర్మాణం కూడా అభివృద్ధి ప్రణాళికలో భాగంగా పేర్కొన్నారు.

రాకపోకల సౌకర్యం..

మాబుడి ఠకురాణి ఆలయానికి రాకపోకల సౌకర్యాలు అత్యున్నతంగా మెరుగు పరుస్తారు. ఆలయ ప్రాంగణాన్ని చేరుకునేందుకు వీలుగా సువిశాల రహదారితో వాహనాల పార్కింగ్ స్థలం, ఆడిటోరియం, ల్యాండ్ స్కేపింగ్, చెట్ల పెంపకంతో పాటు అభివృద్ధి చేస్తారు. ఆలయ ప్రాంగణం ప్రకృతి రమణీయంగా రూపుదిద్దుకుంటుంది.

క్లుప్తంగా

వర్కింగ్ జర్నలిస్టులకు బీమా యోజన

● వెబ్‌పోర్టల్ ఆవిష్కరించిన సీఎం



భువనేశ్వర్: వర్కింగ్ జర్నలిస్టుల స్వాస్థ్య బీమా యోజన పథకం కోసం అనుకూలమైన సదుపాయం అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుక్రవారం యూజర్ ఫ్రెండ్లీ వెబ్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయులు సమాజంలో అవగాహన పెంపొందించుకోవాల్సిన ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. జర్నలిస్టులకు రాష్ట్రప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి ప్రదీప్‌కుమార్ అమత్, విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్ సింగ్, డైరెక్టర్ సరోజ్‌కుమార్ సామల్, టెక్నికల్ డైరెక్టర్ సురేంద్రనాథ్ పరిడా, ఇతర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వర్చువల్ విధానంలో డీపీఆర్‌ఓలు హాజరయ్యారు. అంతకుముందు రాష్ట్రప్రభుత్వం 'గోపబంధు సాంబాదిక్ స్వాస్థ్య బీమా యోజన' ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద వర్కింగ్ జర్నలిస్టులతో అర్హులైన వారి కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చులను భరించనుంది.

సమస్యల పరిష్కారానికే వెల్ఫేర్ డే

విజయనగరం క్రైమ్: పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే చర్యలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలీసుల అభ్యున్నతికి తామెప్పుడూ ముందుంటామన్నారు. పదోన్నతులు, రావాల్సిన బకాయిలు, బదిలీలపై సమస్యలను సిబ్బంది వివరిస్తున్నారని, వాటిన్నంటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీపేట కోర్టును పరిశీలించిన జడ్జి ఫణికుమార్

వంగర: మండల పరిధి లక్ష్మీపేట ప్రత్యేక న్యాయస్థానాన్ని జడ్జి ఫణికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులతో కలిసి కోర్టు పరిసరాలు, ఇక్కడ ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు, తహసీల్దార్ డి.ఐజాక్, ఎస్సై ఆర్.జనార్దనరావు ఉన్నారు.

జీసీఎస్ఆర్ కళాశాలలో నాక్ బృందం



రాజాం కళాశాలలో వివరాలు సేకరిస్తున్న నాక్ బృందం

రాజాం: పట్టణంలోని జీఎంఆర్ విద్యాసంస్థలకు చెందిన జీసీఎస్ఆర్ కళాశాలను నాక్ బృందం శుక్రవారం పరిశీలించింది. ఐదు సంవత్సరాల నుంచి ఇప్పటివరకూ కళాశాలలో నిమౌలికవసతులు, సదుపాయాలు, బోధన తదితర అంశాలపై సభ్యులు ఈ సందర్భంగా ఆరాతీశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచంలో అవసరమైన విద్యను సాంకేతిక విజ్ఞానంతో మిళితం చేసి అందించాలని లెక్చరర్లకు సూచించారు. కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి అభిప్రాయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తంరావు, ఐక్యూ ఏసీ కన్వీనర్ మురపాక రమేష్, ఉపాధి కల్పనాధికారి సీహెచ్.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ శిక్షణతో మెరుగైన విద్య



డిజిటల్ శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులకు నాణ్యమైన బోధన అందించేందుకు అవకాశం ఉంటుందని డిజిటల్ శిక్షణ రాష్ట్ర పరిశీలకుడు విశ్వేశ్వరయ్య అన్నారు. శుక్రవారం రాజాంలోని జీఎంఆర్ఐటీలో జరుగుతున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్ శిక్షణను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు అంశాల గురించి వివరించారు. ప్రభుత్వం చేస్తున్న కృషికి మనందరం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ ఆర్.మురళీకృష్ణ, ఫెసిలిటేటర్స్ కుమరాపు చంద్రునాయుడు, సీహెచ్.కృష్ణప్రసాద్, ట్రైనర్స్ సతీష్, రవికిశోర్, అదనపు కోర్సు డైరెక్టర్ గంగునాయుడు, రాజాం, సీతంపేట, వీరఘట్టం, జియమ్మవలస మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వన మహోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



రాయగడ: మొక్కలు నాటుతున్న అటవీశాఖ సిబ్బంది

ఊరూరా వన మహోత్సవాలు

● మొక్కలు నాటిన విద్యార్థులు, అధికారులు
● పర్యావరణ ప్రాధాన్యతను వివరించిన ఉపాధ్యాయులు

జయపురం: వన మహోత్సవ వారోత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మొక్కలు నాటారు. పర్యావరణ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవం చేపట్టారు. పాఠశాల ఈకో క్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్, న్యాయసేవా సహాయ క్లబ్, స్కౌట్స్ అండ్ గైడ్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించింది. హెచ్‌ఎం ప్రకాష్‌చంద్ర పర్యవేక్షణలో ఉసిరి, పనస, జామి తదితర రకాల 100కు పైగా మొక్కలు నాటామని ఈకో క్లబ్ అధికారి యజ్ఞేశ్వర పండా వెల్లడించారు. కార్యక్రమంలో జూనియర్ రెడ్‌క్రాస్ అధికారి శుభస్మిత సాహు, న్యాయసేవా సహాయక క్లబ్ విశ్వరంజన్ గౌడ, స్కౌట్ మాస్టర్ సోమనాథ్ సాకియ, గైడ్స్ టీచర్ రస్మిత నాయక్, ఎన్‌సీసీ కమాండర్ దేవేంద్ర కుమార్ పాఢి తదితరులు పాల్గొన్నారు. అలాగే జయపురం అటవీశాఖ అధికారులు వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు దుర్గాప్రసాద్ పాత్రొ, ఐశ్వర్య పుష్టి, గౌతమ త్రిపాఠి, బీబీ జెనా, ఉమాశంకర ఆచారి, సమీక్షా దాస్ ఆస్పత్రి మేనేజర్ రూపసి మధుస్మిత నాయక్, డాక్టర్ కనూ ప్రధాన్ పాల్గొని మొక్కలు నాటారు. ఎకంబా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జయపురం ప్రభుత్వ మహిళా కళాశాల, బొయిపరిగుడ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి, కేవిడి పంచాయతీ బింధానీగుడ, ప్రధానీగుడ గ్రామాల్లో వన మహోత్సవాలు చేపట్టారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి సచ్చిదానంద పరిడా, ఫారెస్టర్, సిబ్బంది పాల్గొన్నారు.



వన మహోత్సవంలో పాల్గొన్న వైద్య సిబ్బంది



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మొక్కలు నాటుతున్న వైద్యులు

పజినిపాదోరొలో వన మహోత్సవం

రాయగడ: జిల్లాలోని మునిగుడ అటవీరేంజ్ పరిధి పజినిపాదోరొ రిజర్వ్ ఫారెస్ట్‌లో సుమారు 10ఎకరాల విస్తీర్ణంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. రేంజర్ సురేష్‌చంద్ర పాత్రొ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి పర్యావరణ పరిరక్షణ ప్రేమికులు గౌరాంగచరణ్ రౌత్, అంబోదల పోలీస్ స్టేషన్ ఎస్ఐ భరత్‌కుమార్ మాఝి, అటవీశాఖ సిబ్బంది క్షమానిధి నాగ్, మోహన్‌కుమార్ సాహు, త్రినాథ్ పాత్రొ, జి.మురళీమోహన్, కె.శివప్రసాదరావు, షర్మిష్ఠ బొడొజెన్న, సామల్‌రావు తదితరులు పాల్గొన్నారు. సుమారు 500 లకు వివిధ రకాల మొక్కలు నాటగా, గ్రామస్తులు సహకారం అందించారు. రేంజర్ సురేష్‌పాత్రొ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని కోరారు. పర్యావరణం సమతుల్యంగా ఉంటే అంతా ఆరోగ్యంగా ఉంటామన్నారు. అడవులను నరికితే, కాలుష్య కోరల్లో చిక్కుకోవడమే కాకుండా జీవితం అతలాకుతలం అవుతుందని వివరించారు.



మొక్కలు నాటుతున్న జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యులు

అవినీతిపై ఉక్కుపాదం

● ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు ఉద్యోగుల తొలగింపు
● ఆరుగురికి శాశ్వతంగా పింఛన్ రద్దు చేసిన రాష్ట్రప్రభుత్వం



భువనేశ్వర్: అవినీతి రహిత పాలన చర్యల్లో భాగంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఘాటుగా స్పందించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా అవినీతికి పాల్పడిన వారికి వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో 9మంది ఉద్యోగులపై చర్యలు చేపట్టినట్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ముగ్గురిని ఉద్యోగం నుంచి బహిష్కరించగా, ఆరుగురికి శాశ్వతంగా పింఛన్ నిలిపి వేసినట్లు వెల్లడించారు. సీఎం నవీన్ తరచూ ప్రభుత్వ ఉద్యోగులకు వ్యతిరేకంగా ఇటువంటి చర్యలు చేపట్టడం ఆనవాయితీగా మారింది. ఆయన పాలనలో సమగ్రంగా 197మంది సిబ్బంది ఈ తరహా వేటుకు గురయ్యారు. ఉద్యోగ రంగంలో అవినీతి పరుల బహిష్కరణ, నిర్బంధ పదవీ విరమణ, పింఛన్ రద్దు వంటి చర్యలు చేపట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అసమర్థత, అసభ్యత వంటి ఆచరణ నియమావళి ఉల్లంఘించిన వారిని సైతం మినహాయించకుండా రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపడుతోంది. తాజాగా ఇటువంటి చర్యలకు గురైన 9మంది అధికారులలో.. కటక్ జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ డివిజన్-2 మాజీ కార్య నిర్వహణాధికారి(ఈఓ) శివరామ్ విశాల్ అవినీతి కేసులో దోషిగా నిర్ధారించబడడంతో అతని పింఛన్‌ను శాశ్వతంగా నిలిపి వేశారు.

నిందితులు వీరే..

● నవరంగపూర్ జిల్లా ఉమర్‌కోట్‌కు చెందిన అగ్రికల్చర్ మాజీ అసిస్టెంట్ ఆఫీసర్ గోకుల్‌చంద్ర నాయక్ అవినీతి కేసులో దోషిగా ఖరారయ్యారు. విధి నిర్వహణలో అసమర్థతను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రప్రభుత్వం ఆయనను ఉద్యోగం నుంచి తొలగించింది.

● ప్రభుత్వ అధికారి హోదాలో విధుల నిర్వహణలో నిజాయితీ, చిత్తశుద్ధి కొరవడడంతో బర్‌గఢ్ జిల్లా సోహెలా ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ మాజీ జూనియర్ ఇంజినీర్ ఉపేంద్రభంజ్ నాయక్‌ను విధుల నుంచి బహిష్కరించారు.

● కలహండి జిల్లా కలహండి మండలం బీఐడీ(రిటైర్డ్ ఓఏఎస్ అధికారి) గందారామ్ ఖమారి అవినీతి కేసులో దోషిగా తేలారు. అతని పింఛన్, గ్రాట్యుటీ శాశ్వతంగా నిలిపి వేసేందుకు ఉత్తర్వులు జారీ చేశారు.

● జి.ఉదయగిరి అగ్రికల్చర్ ఆఫీసర్ మాజీ అసిస్టెంట్ కృష్ణచంద్ర గౌడ్ అవినీతికి పాల్పడ్డారని పింఛన్, గ్రాట్యుటీని శాశ్వతంగా నిలిపివేశారు.

● మల్కన్‌గిరి జిల్లా భూసార పరిరక్షణ మాజీ అధికారి దాశరథి త్రిపాఠి అవినీతి కేసులో దోషిగా తేలడంతో ఆయన పింఛన్, గ్రాట్యుటీ నిలిపివేతకు ఆదేశించారు.

● అవినీతి కేసులో దోషిగా తేలి, విధి నిర్వహణ రంగంలో అసమర్థత ఆరోపణలపై సుందర్‌గఢ్ జిల్లా లోకల్ ఫండ్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ మాజీ ఆడిటర్ సుశీల్‌కుమార్ మెహర్‌పై బహిష్కరణ వేటుతో తొలగించారు.

● మయూర్‌భంజ్ ఉదొలా సామాజిక విద్యాశాఖ మాజీ అధికారి ఆనంద్‌చంద్ర నాయక్‌కు వ్యతిరేకంగా అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో దోషిగా తేల్చారు. అతని పింఛన్, గ్రాట్యుటీ శాశ్వతంగా నిలిపివేశారు.

● నయాగఢ్ జిల్లా చాంద్‌పూర్‌కు చెందిన డీఎంఎస్ఎస్ మాజీ సూపరింటెండెంట్ సురేంద్రనాథ్ పతి పింఛన్ శాశ్వతంగా నిలిపివేశారు. అవినీతి ఆరోపణల్లో ఆయన దోషిగా తేలడంతో ఈ మేరకు చర్యలు చేపట్టారు.

జాతర మహోత్సవాలకు పందిరిరాట

విజయనగరం టౌన్: హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దచెరువు గట్టుపై వెలిసిన శ్రీ విజయసాగర దుర్గమ్మ తల్లి జాతర మహోత్సవాలు పందిరిరాటతో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ అధ్యక్ష్య,కార్యదర్శులు దవడ మీనా, కొండబాబు, కోశాధికారి స్రవంతిలతో పాటు భక్తులు పందిరిరాట మహోత్సవంలో పాల్గొని, విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతోఆనందంగా ఉండాలని జాతర మహోత్సవాల్లో వేప,రావిచెట్లకు కల్యాణం నిర్వహిస్తున్నామని చెప్పారు. 8న శని వారం సాయంత్రం 6 గంటలకు కల్యాణం జరగనుందని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

డెంకాడ: మండలంలోని కాంపెక్స్ సమీపంలో నిర్మాణంలో ఉన్న టీడీపీ కార్యాలయం ఆవరణలో చొల్లంగి పేటకు చెందిన వాతాడ రాజశేఖర్(34) మృతదేహం అనుమానాస్పదంగా పడి ఉంది. వివరాలిలా ఉన్నాయి. రాజశేఖర్ కుమిలిలో ఒక బ్యాంకుకు సంబంధించి మినీబ్యాంకు నిర్వహణతో పాటు బ్యాంకులో హెల్పర్‌గా ప్రైవేట్‌గా పని చేస్తున్నాడు.గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన రాజశేఖర్ తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం శవమై పడి ఉన్నాడు. ఊపిరి ఉందేమో అని డెంకాడ పీహెచ్‌సీకి కుటుంసభ్యులు తీసుకువచ్చే సమయంలోనే గమనించిన వైద్యసిబ్బంది ఆస్పత్రి బయటకు వెళ్లి చూసి అప్పటికే మరణించాడని నిర్ధారించారు. రాజశేఖర్ మృతదేహం వద్ద తల్లిదండ్రులు అప్పలరాజు, లక్ష్మికుమారిలు,బంధువులు బోరున విలపించారు. అత్తవారింటికి వెళ్తానని చెప్పి బయల్దేరాడని కుటుంబ సభ్యులు చెబుతున్నట్లు ఎస్సై తెలిపారు. పోలీసులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి ముఖంపై చిన్నపాటి కమిలిన గాయాలు ఉన్నాయి. ఎవరైనా కొడితే గాయాలయ్యాయా? మృతదేహం చాలా సేపు నేలపై ఉండడం వల్ల అలా జరిగిందా? అన్నది తెలియాల్సి ఉంది. ఈ మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో ఆరా తీస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

పాలకొండ రూరల్: మండలంలోని సిరికొండ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్సపొందుతూ ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రాజాం నియోజకవర్గం జి.సిగడాం గ్రామానికి చెందిన డిగ్రీ రెండవ సంవత్సరం విద్యార్థి ఊశెట్టి సురేష్ (22), ఆదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు నాగవరపు కృష్ణతో కలిసి ద్విచక్రవాహనంపై పాలకొండ మీదుగా సీతంపేట పార్కుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న నాలుగు చక్రాల వాహనం ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై నుంచి కింద పడడంతో తల, కాళ్లకు తీవ్రంగా గాయాలవడంతో వారిని తొలుత పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం శ్రీకాకుళం తీసుకువెళ్లగా ఆస్పత్రిలో సురేష్ మరణించాడు. స్నేహితుడు ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్లు ఎస్సై బి.శివప్రసాద్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

శృంగవరపుకోట: ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా తరలివస్తున్న గంజాయిని ఎస్.కోట పోలీసులు మాటువేసి పట్టుకుని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జ్ సీఐ బాలసూర్యారావు వివరాలు తెలిపారు. ఉదయం వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు అనంతగిరి నుంచి ఎస్.కోట వస్తున్న ఇన్నోవాను నిలిపి సోదాలు చేయగా వాహనంలో తరలిస్తున్న 155 కిలోలు గంజాయి పట్టుబడింది. ఒడిస్సా రాష్ట్రంలోని మలక్‌న్‌గిరి జిల్లా, పనసపుట్ మండలం, మూలపుట్ గ్రామానికి చెందిన రామ్‌నాథ్ ఖితో కొండప్రాంతంలో గంజాయిని పండించి, మహరాష్ట్రలో భివాండీ ఠాణా పరిధిలో గల గుల్జార్‌నగర్ ప్రాంతానికి చెందిన ఫరూఖ్ ఖురేషి, అతీఖ్‌అహ్మద్ రఫీఖ్‌షేక్‌లకు రూ.2లక్షలకు విక్రయించాడు. గంజాయి కొనుగోలు చేసిన వారు ఇన్నోవాలో వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా నిందితుల దగ్గర 3మొబైల్ ఫోన్లు, 155కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశామని, పట్టుబడిన గంజాయి విలువ బహిరంగమార్కెట్‌లో రూ. 6,20,000లు ఉంటుందని ఆయన వివరించారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్.కోట పోలీసులు

బొబ్బిలిలో మరొకరు..

బొబ్బిలి: పట్టణంలో గంజాయితో సంచరిస్తున్న మైసూరుకు చెందిన మురుగన్ అలియాజ్ గిరిధర్‌ను అరెస్టు చేసినట్టు ఎస్సై చదలవాడ సత్యనారాయణ విలేకరులకు తెలిపారు. రైల్వేస్టేషన్ జంక్షన్ ప్రాంతంలో గంజాయితో తిరుగుతున్న వ్యక్తిని పట్టుకుని ప్రశ్నించి అరెస్టు చేశామన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు.

పదో తరగతి ఫెయిలయిన వారికి రీజాయినింగ్

● డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీ రావు

బొబ్బిలి: పదో తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు పాఠశాలల్లో రీజాయినింగ్ విధానాన్ని తీసుకువచ్చినట్లు డిప్యూటీ డీఈఓ పి బ్రహ్మాజీరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి తప్పిన విద్యార్థులకు ప్రామాణికాలు పెంచి వారిని ఉత్తీర్ణులను చేసేందుకు మరింత శ్రద్ధ వహించనున్నట్లు చెప్పారు. బొబ్బిలి డివిజన్‌లో ఇలా తప్పిన విద్యార్థులు పది మండలాల్లో 748 మంది ఉన్నట్లు గుర్తించామని వారిని ఆయా పాఠశాలల్లో చేర్పించి పదో తరగతి ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదునిచ్చి వారికి అమ్మ ఒడి నిధులు కూడా తల్లుల ఖాతాల్లో మళ్లీ జమ చేయనున్నామన్నారు.

పేద పిల్లలకు ప్రైవేట్‌లో 25 శాతం సీట్లు:

జిల్లాలో తెల్ల రేషన్ కార్డున్న పేద పిల్లలకు 3 కిలోమీటర్ల లోపున్న ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించేందుకు చర్యలు తీసుకున్నామని డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు తెలిపారు. లాటరీ ద్వారా ఈ సీట్లు కేటాయించి, ఫీజులు లేకుండా విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● జంగారెడ్డిగూడెం నుంచి విశాఖ వెళ్తుండగా ప్రమాదం
● 30 మంది ప్రయాణికుల్లో నలుగురికి గాయాలు
● కశింకోట ఆర్‌ఈసీఎస్ వద్ద ఘటన

కశింకోట: అనకాపల్లి జిల్లా కశింకోట ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు మహిళలు, మరో ప్రయాణికుడు, బస్సు డ్రైవర్ ఉన్నారు. ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు అక్కడి నుంచి విశాఖపట్నం వస్తోంది. ఈ క్రమంలో స్థానిక ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పల్లపు ప్రాంతంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం అంటిపేట గ్రామానికి చెందిన బక్కు గౌరీశ్వరి, విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెదసామాలపల్లి గ్రామానికి చెందిన జరజాపు సావిత్రి, జంగారెడ్డిగూడెంకు చెందిన కేతిరెడ్డి సత్యనారాయణ గాయపడ్డారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో డ్రైవర్ బుక్కా శ్రీనివాసరావు బస్సు కేబిన్‌లో చిక్కుకోవడంతో స్థానికులు బయటకు తీశారు. క్షతగాత్రులను హైవే పోలీసుల సహాయంతో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం స్వల్ప గాయాలు కావడంతో తమ గమ్యస్థానాలకు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. సురక్షితంగా బయటపడిన 26 మందిని వేరే బస్సులో గమ్యాలకు తరలించారు. బస్సు ముందు భాగం దెబ్బతింది. అద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. దాన్ని క్రేన్ సహాయంతో స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్‌కు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



కశింకోట వద్ద రోడ్డు పక్కన బోల్తాపడిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు

అదిగదిగో గిరిజన వర్సిటీ

విద్యలనగరంలో మరో విద్యామందిరం నిర్మితం కానుంది. ఇప్పటికే గిరిజన ఇంజినీరింగ్ కళాశాల, వైద్యకళాశాల నిర్మాణాలు సాగుతుండగా.. కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ భవన నిర్మాణాలకు కొద్దిరోజుల్లో పునాదిరాయ పడనుంది. భూసేకరణ ప్రక్రియ ముగిసి భూమిని వర్సిటీ అధికారులకు అప్పగించే క్రతువు పూర్తయింది. రెండు రహదారుల నడుమ.. ఆహ్లాదకర వాతావరణంలో.. చదువుల నిలయం ఏర్పాటు పనులు చకచకా సాగుతున్నాయి.

● పూర్తయిన భూసేకరణ ప్రక్రియ
● 561.91 ఎకరాల భూమిని వర్సిటీ అధికారులకు అప్పగింత
● గిరిజన విశ్వవిద్యాలయం ఇతర పనులకు చకచకా అడుగులు
● భూములిచ్చిన చినమేడపల్లి, మర్రివలస రైతులకు రూ.30.57 కోట్ల పరిహారం చెల్లింపు
● కురుపాం సభలో ముఖ్యమంత్రి ప్రకటన తర్వాత మరింత జోరందుకున్న ప్రక్రియ



గిరిజన వర్సిటీ ఏర్పాటుపై సమావేశమైన కేంద్ర బృందం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రానికి వచ్చిన ప్రాజెక్టుల్లో ప్రధానమైనది గిరిజన విశ్వవిద్యాలయం. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలను, గిరిజన ప్రజల ఆశలను తీర్చుతూ కార్యరూపం దాల్చిన ఈ ప్రాజెక్టు పనుల్లో తాజాగా జోరు పెరిగింది. విశ్వవిద్యాలయం నిర్మాణానికి, ఇతర వసతుల కల్పనకు ప్రతిపాదించిన 561.91 ఎకరాల భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. ఈ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 37.45 కోట్లు కేటాయించింది. సహజ సిద్ధమైన చెరువులు, నీటి గుంతలు పోగా నిర్మాణానికి అనువైన 519 ఎకరాల భూమిని ఈ నెల ఆరోతేదీన యూనివర్సిటీ యాజమాన్యానికి జిల్లా యంత్రాంగం అప్పగించింది. ఇటీవల కురుపాం సభలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి త్వరలోనే జిల్లాకు మళ్లీ వస్తాను.. గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనలో భాగస్వామ్యం అవుతానని ప్రకటించడంతో ఇక్కడ ప్రక్రియలో మరింత వేగం పెరిగింది. వర్సిటీ తరగతులను 2019 నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలోని తాత్కాలిక భవనాల్లో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

సమష్టిగా ముందుకు...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాలూరు నియోజకవర్గంలోని అచ్చమైన గిరిజన ప్రాంతంలోనే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్ హోదాలోని అధికారులు భూసేకరణ ప్రక్రియలో సమష్టిగా శ్రమించారు. భూసేకరణను పూర్తి చేశారు. ఎన్నో ఏళ్ల నాటి కల సాకారమవుతుందనే సంతోషం అటు గిరిజనులు, ఇటు మైదాన ప్రాంత ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

ఆహ్లాదకరమైన వాతావరణం

విశ్వ విద్యాలయం నిర్మాణానికి సంబంధించి మెంటాడ, దత్తిరాజేరు మండలాల పరిధిలో సేకరించిన భూమిలో దాదాపు 80 శాతం ప్రభుత్వ భూమే ఉండడం గమనార్హం. మెంటాడ మండలం చినమేడపల్లి పరిధిలో 155.44 ఎకరాలు, దత్తిరాజేరు మండలం మర్రివలస పరిధిలో 391.17 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదే. రెండు గ్రామాల రైతులకు చెందిన జిరాయితీ భూమి 67.30 ఎకరాలు మాత్రమే ఉంది. మొత్తం భూమిలో 42.88 ఎకరాలు చెరువులు, నీటి గుంతల రూపంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. సహజ సిద్ధంగా ఉన్న చెరువులను, నీటి గుంతలను అలాగే ఉంచి భవన నిర్మాణాలు చేపడతారని అధికారులు పేర్కొన్నారు. 2023 జూన్ మాసంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.265 ప్రకారం భూసేకరణ, నష్ట పరిహారపు చెల్లింపు ప్రక్రియను పూర్తి చేసినట్టు అధికారులు వివరించారు.

మంత్రి చొరవ...

చినమేడపల్లి, మర్రివలస గ్రామాలకు చెందిన 99 రైతులు 67.30 ఎకరాల భూమిని అప్పగించగా ప్రభుత్వం రూ.10.47 కోట్ల పరిహారం చెల్లించింది. మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో డి.పట్టాదారులైన 279 మందికి కూడా ప్రభుత్వం రూ.13.92 కోట్లు పరిహారం అందించింది. అలాగే, ఎలాంటి హక్కు పత్రాలు లేకుండా అనుభవదారులైన రైతులకు కూడా రూ.5.58 కోట్లు చెల్లించడం గమనార్హం. అర్హత కలిగిన ఏ ఒక్క రైతుకూ నష్టం కలగకుండా.. విద్యా శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ సహకారం, చొరవతో నిర్ణీత సమయంలో భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసినట్టు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. మొత్తం భూసేకరణ ప్రక్రియ, ఇతర అవసరాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.37.45 కోట్లు కేటాయించింది. ఇందులో ఇప్పటికే భూములప్పగించిన రైతు సోదరులకు రూ.30.57 కోట్లు పరిహారం కింది చెల్లించింది.

సజావుగా భూసేకరణ ప్రక్రియ



అనుకున్న సమయానికి భూమిని అప్పగించడంలో అధికారులు సమష్టిగా సమన్వయంతో కృషి చేశారు. చినమేడపల్లి, మర్రివలస గ్రామాల రైతులు కూడా సానుకూలంగా స్పందించి పూర్తి సహకారం అందించారు. ఎలాంటి సమస్యలు లేకుండా ప్రక్రియను సజావుగా నిర్వహించాం. అధికారులు, కింది స్థాయి సిబ్బంది, రైతులు అందించిన సహకారం అభినందనీయం. అర్హత కలిగిన రైతులందరికీ నిబంధనల ప్రకారం నష్ట పరిహారం చెల్లించాం.

– ఎస్.నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్, విజయనగరం

క్లుప్తంగా

ప్రజల హృదయాల్లో వైఎస్సార్ స్థానం సుస్థిరం


మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన పాలనతో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శనివారం వైఎస్సార్ జయంతి సందర్భంగా శుక్రవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచంలో తెలుగు వారు ఎక్కడున్నా వైఎస్సార్ జయంతి సందర్భంగా మహానేతకు ఘనంగా నివాళులు అర్పిస్తారని పేర్కొన్నారు. ఆనాడు వైఎస్సార్ తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగానే తెలుగు రాష్ట్రాల్లో అనేక మందివిద్యార్థులు ప్రయోజకులుగా మారారని తెలిపారు. మహానేత పద్ధతిలోనే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు.

ఉత్తమ అధికారికి అభినందనలు


ఏఈ గోపీకృష్ణను అభినందిస్తున్న దృశ్యం

జలుమూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి జిల్లాలో జలుమూరు మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా అమరావతిలో శుక్రవారం జలుమూరు గృహ నిర్మాణ ఏఈ గోపీకృష్ణకు గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, ఎండీ స్వామయ్యలు సన్మానించి శాలువతో సత్కరించి జ్ఞాపిక అందించారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ రెవెన్యూ గ్రూపులో సర్వే నంబర్–177లో ఉన్న 1.32 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉన్నట్లు ఇటీవల జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు సదరు భూమిని కొత్తూరు రెవెన్యూ అధికారులు పరిశీలించారు. జేసీ ఆదేశాల మేరకు శుక్రవారం తహశీల్దార్ చక్రవర్తి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు.

12 నుంచి సాగర్ కవచ్


దేవునల్తాడలో మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న మెరైన్ సీఐ దేముళ్లు

వజ్రపుకొత్తూరు: తీర ప్రాంత రక్షణలో భాగంగా ఈ నెల 12, 13 తేదీల్లో సాగర్ కవచ్(కోస్టల్ ఎక్సర్‌సైజ్) కార్యక్రమం చేపడుతున్నట్లు భావనపాడు మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ జి.దేముళ్లు తెలిపారు. శుక్రవారం వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడలో మత్స్యకారులకు సాగర్ కవచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులంతా అప్రమత్తంగా ఉండి సముద్ర ప్రాంతం గుండా ఎవరైనా గుర్తు తెలియని చొరబాటుదారులు ప్రవేశిస్తే కోస్టల్, స్థానిక పోలీసులకు సమాచారం చేరవేయాలని కోరారు.

పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: రాగోలులోని బొల్లినేని మెడికల్ స్కిల్‌లో ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డిప్లమో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు సెంటర్ హెడ్ సీహెచ్ నాగేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్(ఏ గ్రూపైనా) చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. డిప్లమో ఇన్ అనస్తీషియా, ఎంఎల్‌టీ, రేడియాలజీ, ఆప్తమా టెక్నీషియన్, ఆప్తమా ట్రీ అసిస్టెంట్, కార్డియాలజీ, క్యాత్‌ల్యాబ్, డయాలసిస్, హెల్త్ అసిస్టెంట్ తదితర 14 పారామెడికల్ కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. కన్వీనర్ కోటా కింద ఈ నెల 24 వరకూ, మేనేజ్‌మెంట్ కోటా కింద ఆగస్టు 24 వరకూ ప్రవేశం పొందేందుకు అవకాశముందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు రాగోలు జెమ్స్ ఆసుపత్రి (76809 45357, 7995013422)లో సంప్రదించాలన్నారు.

9న ఫ్యాప్టో సదస్సు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం నిమిత్తం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న జిల్లాస్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎస్వీ రమణమూర్తి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసంపూర్ణంగా ఉన్న జీవో నెంబర్ 117 రద్దు చేయాలని, 11వ పీఆర్సీ బకాయిలు తక్షణమే చెల్లించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగ, ఉపాధ్యాయులను ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 2022 పీఆర్సీ ప్రకారం మినిమం టైం స్కేల్ వేతనం మంజూరు చేయాలని పిలుపునిస్తూ చేపడుతున్న సదస్సుకు అన్ని సంఘాల సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సదస్సుకు ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ ఎస్.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ మంజుల, జిల్లా ఫ్యాప్టో చైర్మన్ మజ్జి మదన్‌మోహన్, ఇతర పెద్దలు హాజరుకానున్నట్టు చెప్పారు.

రక్తదానానికి మీరే 'స్ఫూర్తి' కావాలి


కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు, అధికారులు





సత్కారం అందుకుంటున్న టెక్కలి సబ్‌కలెక్టర్‌రాహుల్ కుమార్ రెడ్డి, డీపీఆర్వో మాన్‌సింగ్, తమ్మినేని వాణి సీతారాం, రమణమూర్తి



ఆకట్టుకున్న రక్తదాన నృత్య రూపకం

- 18 ఏళ్లు దాటిన వారు లైఫ్ మెంబరుగా చేరాలి
- రెడ్‌క్రాస్ అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం కల్చరల్: 'స్ఫూర్తి' కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. పుట్టిన రోజు, పెళ్లిరోజు వంటి శుభకార్యాలయ సమయంలో రక్తదానం వంటి సేవా కార్యక్రమం చేసిన వారికి ప్రత్యేకంగా ధ్రువపత్రాలు జారీ చేస్తామని ప్రకటించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రెడ్‌క్రాస్ సభ్యులుగా చేరాలని కోరారు. టీబీ రోగులకు ఇచ్చే పౌష్టికాహార కిట్లను సమకూర్చేందుకు ఎంతో మంది దాతలు ముందుకు వచ్చారని తెలిపారు. గత ఏడాది మొక్కలు నాటే కార్యక్రమానికి జిల్లాకు అవార్డు వచ్చిందని, ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తి కనబరచాలని పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో రెడ్‌క్రాస్ అదనపు భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. రక్తదానంపై అపోహలు వీడాలన్నారు. స్థానికంగా క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదిక పంపామని, త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా కలెక్టర్ సహకారంతో జిల్లాలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. దీనికి సంబంధించిన ఫొటో ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. రఘుపాత్రుని శ్రీకాంత్ నేతృత్వంలో బృందం రక్తదానంపై ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది.

దాతలకు అవార్డుల ప్రదానం..

రెడ్‌క్రాస్‌కు సేవలందించిన సేవకులకు, రక్తదాన శిబిరాలు నిర్వహించిన సంస్థలకు, రక్తదాతలకు కలెక్టర్ సత్కరించారు. ముందుగా ఎక్కువ రక్తదాన శిబిరాలు నిర్వహించిన తమ్మినేని వాణి సీతారాం, సువ్వారి గాంధీ, గౌతు శిరీష, టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ సుదీర్, కంటి వైద్యులు పీఎల్ఎస్ రాజు, అదనపు డీఎంహెచ్‌వో అనూరాధ, నగరపాలక కమిషనర్ ఓబులేసు, డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమలచైతన్య, ఆర్‌ఐఓ పి.దుర్గారావు, పార్వతీపురం చైర్మన్ శ్రీరాములు నాయడు, కనుగుల దుర్గా శ్రీనివాస్, పి.శ్రీకాంత్, రెడ్‌క్రాస్ సభ్యులు కె.సత్యనారాయణ, ఆర్డ్స్ సంస్థ ప్రతినిధి నానిబాబు, నిక్కు అప్పన్న, మల్ల కల్యాణ చక్రవర్తి, పెంకి చైతన్య కుమార్, బి.చిన్మయరావు తదితరులు పాల్గొన్నారు.

నిద్రమత్తులో ప్రాణాలు గల్లంతు

- కల్వర్టును ఢీకొట్టిన వాహనం
- ఇద్దరు మృతి, నలుగురికి గాయాలు
- మృతులు హైదరాబాద్ వాసులు


పలాస మార్చురీలో మృతదేహాలు


కల్వర్టును ఢీకొట్టిన వాహనం

కాశీబుగ్గ: తీర్థ యాత్రల కోసం బయల్దేరారు. దైవ దర్శనాలన్నీ సజావుగా జరిగాయి. తెలంగాణ నుంచి ఒడిశా వరకు ప్రయాణం అంతా సరదాగా గడిచిపోయింది. కానీ దేవుడు వారి నుదుటిపై తిరుగు ప్రయాణాన్ని రాయలేదు. ఒడిశా వెళ్లి దేవుడిని దర్శించుకున్న యాత్రికులు.. తిరిగి ఇంటికి చేరకుండానే అనంతలోకాలకు వెళ్లిపోయారు. పలాస పరిధి రామకృష్ణాపురం వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. నలుగురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..

హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో చైతన్యపురికి చెందిన రెండు కుటుంబాలు ఒడిశా టూర్‌కు బయల్దేరాయి. వీరు ఆదివారం బొలేరోపై బయల్దేరి పూరి, కోణార్క్ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. ఆంధ్రా–ఒడిశా బోర్డర్‌లో ఉన్న ఓ పెట్రోల్ బంకు వద్ద డ్రైవర్ నిద్రపోయారు. కానీ వేగంగా ఇంటికి చేరుకోవాలనే తొందరలో యాత్రికులు డ్రైవర్‌ను నిద్రలేపి మరీ ప్రయాణం సాగించారు. ఉదయం ఆరున్నర గంటల సమయంలో పలాస మండలం రామకృష్ణాపురం వద్దకు వచ్చేసరికి డ్రైవర్‌కు కళ్లు మూతలు పడడంతో బండి కల్వర్టును ఢీకొట్టింది. బండిలో డ్రైవర్‌తో పాటు ఆరుగురు ఉన్నారు. వీరిలో గౌరిశెట్టి రజిత(వేదవతి)(55) అక్కడికక్కడే మృతి చెందగా.. ఆమె భర్త కొండూరు వెంకటయ్య(65) పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అలాగే సముద్రాల కృష్ణయ్య(67), సముద్రాల పద్మ (50), కొండూరు విజయలక్ష్మి (55)లతో పాటు నల్గొండ జిల్లా మద్దిరాల గ్రామానికి చెందిన డ్రైవర్ పగిండ్ల జానయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులకు సపర్యలు చేసి పోలీసులు, 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్లు కాశీబుగ్గ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిద్రమత్తు కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని చెప్పారు. మృతుల కుటుంబాలకు సమాచారం అందించారు. మంత్రి సీదిరి అప్పలరాజు కూడా ఆయా కుటుంబాలతో మాట్లాడి.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని ధైర్యం చెప్పారు.

ధ్రువపత్రాల పరిశీలన వాయిదా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ 23/2021 రిక్రూట్‌మెంట్‌లో భాగంగా జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 9న జరగాల్సిన ధ్రువపత్రాల పరిశీలన, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు వాయిదాపడిందని డీఆర్‌ఓ పి.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 20న పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు.

అక్కసుతో వికృత రాతలు

- తాత్కాలిక వంతెన పనులపై ఈనాడు వక్ర భాష్యం
- ఒక్కో పని జరుగుతూ ఉంటే.. ఏమీ జరగలేదని తప్పుడు రాతలు

అక్షరాల రూపంలో పచ్చపార్టీల అక్కసు బయటపడుతోంది. పనులు జరుగుతున్నాయని తెలుసు.. నిధులు కేటాయించారనీ తెలుసు.. ఆ పనులు పూర్తి కావడానికి సమయం పడుతుందనీ తెలుసు. అయినా తమకు అలవాటైన రీతిలో నాణేనికి ఒక వైపు మాత్రమే చూపిస్తూ 'ఈనాడు' బహుదా వంతెనపై బాబు మెప్పు పొందే కథనాన్ని ప్రచురించింది. ఒక వైపు ఒక్కొక్కటిగా క్రమపద్ధతిలో పనులు జరుగుతూ ఉంటే.. జరిగిన పనుల మాటెత్తకుండా జనాన్ని తప్పుదోవ పట్టించేలా కథనాన్ని అచ్చేసింది.


వంతెన నిర్మాణ ప్రదేశంలో రాళ్లు అన్‌లోడింగ్


వంతెన నిర్మాణ ప్రదేశంలో క్వారీ నుంచి తీసుకొచ్చిన రాళ్లు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఇచ్ఛాపురం బహుదా నదిపై ఈ ఏడాది మే 3వ తేదీన గ్రానైట్ రాయి లోడ్‌తో ట్రక్ వెళ్లడంతో పురాతన వంతెన కూలిపోయింది. వెంటనే మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తదితరులు వెళ్లి తాత్కాలిక వంతెన నిర్మాణానికి రూ. 40లక్షలు మంజూరు చేశారు. శాశ్వత నిర్మాణం కోసం రూ. 20కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాద న పంపించారు. ఈలోగా తాత్కాలిక వంతెన కోసం టెండర్లు పిలిచి, ఖరారు చేశారు. వంతెన కూలిన చోట గ్రానైట్ బండలు తొలగించడానికి కొంత సమయం పట్టింది. ఆ తర్వాత పరిసరాలు శుభ్రం చేశారు. మైనింగ్ శాఖ అనుమతి తీసుకుని నిర్మాణానికి అవసరమైన రాయి తెప్పిస్తున్నారు. మధ్యలో వర్షం ఆటంకం రావడంతో క్వారీల నుంచి రాయి తీసుకురావడంలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయినప్పటికీ పనులు ఒక్కొక్కటీ జరుగుతున్నాయి. ఇదంతా రెండు నెలల సమయంలోనే జరిగింది. ఇదంతా పక్కన పెట్టేసి 'ఈనాడు' తమకు అచ్చొచ్చిన అక్కసు కథనాన్ని ప్రచురించేసింది.

కొన్ని నెలలో, సంవత్సరాలో అయితే జాప్యం అనుకోవచ్చు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే అనేక కార్యక్రమాలు అక్కడ జరుగుతున్నాయి. కానీ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపించేందుకు, ప్రభుత్వంపై బురద జల్లేందుకు 'వంతెన పనుల్లో జాప్యం– ప్రజలకు శాపం 'అంటూ ప్రత్యేక కథనాన్ని వండి వార్చేసింది. దీన్ని బట్టి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాల్జేసేందుకు ఎంత తొందర పడుతుందో అర్థం చేసుకోవచ్చు. పటిష్టమైన రాయితో నిర్మాణం చేపట్టేందుకు రూ.20లక్షల కోసం అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి కలెక్టర్‌కు పంపించారు. వాస్తవానికైతే, వీటి కోసం ఆగాల్సిన పరిస్థితి లేదు. అందుబాటులో ఇప్పటికే రూ.40లక్షలు ఉన్నాయి. ఇవి ఖర్చు అయ్యేలోపు ఆ నిధులు సమకూరనున్నాయి. దీన్ని కూడా వక్రీకరించి... ఆ నిధులు సమకూరితేనే తాత్కాలిక వంతెనకు మోక్షం కల్గుతుందన్నట్టుగా రాసేశారు.

ఒక్కొక్కటీ చేస్తున్నాం..

మైనింగ్ శాఖ అనుమతి వచ్చింది. క్వారీల నుంచి రాళ్లు తీసుకొస్తున్నాం. వర్షాల వల్ల కొండల వద్ద బురదగా ఉండటంతో కొంత ఇబ్బంది ఏర్పడుతోంది. కూలిన వంతెన దగ్గర అన్ని రకాలుగా శుభ్రం చేశాం. రెండు రోజుల్లోనే నిర్మాణ పనులు చేపడతాం. వర్షం ఇబ్బంది లేకపోతే రెండు వారాల్లో రూ. 40లక్షల పనులు పూర్తి చేస్తాం. అదనంగా పంపించిన రూ. 20లక్షల ప్రతిపాదనలకు ఆమోదం రానుంది. వాటితో మొత్తం బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుంది.

– డి.మోహనరావు, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, ఇచ్ఛాపురం.

తాగునీటి ఎద్దడి తీరేలా..!


బాహుదానదిలో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

- మున్సిపాలిటీల్లో మంచినీటి ప్రాజెక్టుల పనులు ప్రారంభం
- జిల్లాలోని మూడు పురపాలక సంఘాలకు రూ.217 కోట్లు విడుదల
- ఏఐఐబీ స్కీమ్ ద్వారా ఇంటింటా కుళాయిలు

పురపాలక సంఘం	ప్రాజెక్టు విలువ	కుళాయి కనెక్షన్లు
ఇచ్ఛాపురం	రూ.58.83 కోట్లు	సుమారు 5,000
ఆమదాలవలస	రూ.62.88 కోట్లు	సుమారు 10,000
పలాస	రూ.95.59 కోట్లు	సుమారు 13,000

ఇచ్ఛాపురం: పురపాలక సంఘాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) నిధుల ద్వారా పురపాలక సంఘాల్లో తాగునీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలో జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు రూ.217 కోట్ల నిధులను విడుదల చేసింది. ఇప్పటికే ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో మంచినీటి కుళాయిలు కనెక్షన్లకు నోచుకొని 1, 2, 3 వార్డులకు అవసరమైన పైపులైన్లు ఏర్పాటు చేశారు. పబ్లిక్‌హెల్త్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక బాహుదానదిలో నీటి మట్టానికి 30 అడుగుల లోతున మూడు ఇన్‌ఫిల్ట్రేషన్ (ఊటబావులు) బావుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వీటితో పాటు బెల్లుపడ, రత్తకన్న, పురుషోత్తపురం వద్ద మూడు రిజర్వాయర్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మున్సిపాలిటిలో సుమారు 5వేల మంచినీటి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసుకునే వీలుంటుంది. ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తయితే రోజూ ప్రతిఒక్కరికి 135 లీటర్ల నీటిని సరఫరా చేయవచ్చు. ఆమదాలవలస మున్సిపాలిటీలో రూ.62.88 కోట్లతో వంశధార నదిలో రెండు ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల నిర్మాణంతో పాటు మెట్టకివలస, ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయం వద్ద రెండు రిజర్వాయర్లు, పలాస మున్సిపాలిటీలో రూ.95.88 కోట్లతో రేగులపాడు ఆఫ్‌సోర్సు రిజర్వాయవద్ద ఇన్‌ఫిల్ట్రేషన్ బావితో పాటు సూదికొండ, ఆర్‌అండ్‌బీ కాలనీలో రెండు రిజర్వాయర్లు నిర్మించనున్నారు.ఈ ప్రాజెక్టు పనులు పూర్తయిన తరువాత మూడు మున్సిపాలిటీల పరిధిలోనూ తాగునీరు పుష్కలంగా అందించవచ్చు.

ఆవిర్భావం తర్వాత తొలిసారిగా..

ఉద్యోగ, ఉపాధి అవకాశాల నేపథ్యంలో పల్లె ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు ప్రజలు వచ్చి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణ శివార్లో కాలనీలు పెరిగాయి. కాలక్రమేణ ఈ పట్టణాల్లో కొన్ని పురపాలక సంఘాలుగా ఆవిర్భవించాయి. ప్రజల అవసరాలకు పురపాలక సంఘం అధికారులు, పాలకవర్గం సహకారంతో మంచినీటి కుళాయిల ద్వారా నీటిసరఫరా అందజేస్తున్నారు. ఇప్పటి వరకు పురపాలక సంఘాల ఆవిర్భావ సమయంలో ఏర్పాటుచేసిన కుళాయిల ద్వారానే మంచి నీటిని సరఫరాను చేస్తున్నారు. దీంతో ప్రజల అవసరాలకు తగ్గట్టు పురపాలక సంఘాలు మంచినీటిని అందించలేక పోతున్నాయి. ఈ క్రమంలో మున్సిపాలిటీల్లో మంచినీటి సమస్యను పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు ఏఐఐబీ నిధుల ద్వారా నీటి ప్రాజెక్టులను ఏర్పాటుచేస్తోంది.

తీరనున్న కల..



1986 లో మున్సిపాలిటీ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు 1, 2, 3 వార్డులు గల పురుషోత్తపురం, ఏఎస్‌పేట, బోర్డర్ ప్రాంతాలకు తాగునీటిని సక్రమంగా అందించలేకపోయారు. సమస్యను సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ఏఐఐబీ ద్వారా మంచినీటి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. బాహుదా నదిలో ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల నిర్మాణం పూర్తయిన వెంటనే పైప్‌లైన్‌కి అనుసంధానం చేసి నీటి సరఫరా ప్రారంభిస్తాం.

– పిలక రాజలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం

గడువులోగా పూర్తిచేస్తాం..



ఏఐఐబి స్కీమ్ కింద చేపడుతున్న మంచినీటి ప్రాజెక్టు పథకాల పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. పనులు వేగవంతంగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఇచ్ఛాపురం మున్సిపాలిటిలో నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనులను నిర్ణీత గడువులోపు పూర్తిచేసి ప్రజలకు తాగునీరు అందిస్తాం.

– పి.సుగుణాకర్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ప్రజా ఆరోగ్యసాంకేతికశాఖ

'చంద్రబాబు మోసకారి'


మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

నరసన్నపేట: ప్రతిపక్ష నేత చంద్రబాబు మోస కారి అని, ఆయనకు కొమ్ముకాస్తున్న పచ్చపత్రికలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు విష ప్రచారం చేస్తున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ 70 వ జన్మదిన వేడుకలు నరసన్నపేటలో పార్టీ అభిమానులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మ న్ కరిమి రాజేశ్వరరావు జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్రజలకు నేరుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతోందని అన్నారు. ప్రభుత్వ పథకాలపై ఒకప్పుడు విమర్శలు చేసిన చంద్రబాబు తన కొత్త మేనిఫెస్టోలో అవే పథకాలను పేరు మార్చి పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలే ఊరూరా ప్ర చారం చేయాలని కోరారు. కృష్ణదాస్ మొదటి నుంచి నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తి అని, రాజకీయాలకు ఆలస్యంగా వచ్చినా మొదటి నుంచి ఆయనకు నాయకత్వ లక్షణాలు ఉన్నా యన్నారు. కృష్ణదాస్ మాట్లాడుతూ తన పుట్టి న రోజు వేడుకలు బాగా జరిపించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, విశ్వాసరాయి కళావతి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానం అమలు చేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగ, ఉపాధ్యాయుల కళ్లలో వెలుగులు నింపాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాతపెన్షన్ సాధన కోసం ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఈ నెల 8న ఉమ్మడి జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద చేపట్టే ధర్నాకు యూటీఎఫ్ మద్దతు ప్రకటిస్తున్నట్టు పేర్కొన్నారు. సంఘ సభ్యులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


ర్యాగింగ్ కలకలం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులను సెకెండియర్ విద్యార్థులు కొట్టిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. కళాశాలలో గత కొద్ది రోజులుగా సీనియర్ ఇంటర్ విద్యార్థులు కొందరు జూనియర్లను కొంతకాలంగా ర్యాగింగ్ చేస్తున్నట్లు సమాచారం. దీనిపై విద్యార్థులు ఒకరిద్దరు అధ్యాపకులకు కూడా సమాచారం అందజేశారు. దీంతో కక్ష పెట్టుకున్న సీనియర్లు ఈనెల 6వ తేదీన సాయంత్రం కళాశాల విడిచిపెట్టిన తర్వాత కళాశాల మైదానంలో ఏకంగా వారిపై దాడికి పాల్పడినట్టు తెలిసింది. అంతటితో ఆగకుండా బయట నుంచి పలువురు యువకులను కళాశాలలోకి రప్పించి వారితో దాడి చేయించినట్టు బాధిత విద్యార్థులు చెబుతున్నారు. ఈ దాడిలో ఇద్దరికి గాయాలు కాగా.. వారు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రిన్సిపల్ ఎస్.కృష్ణవేణి మాట్లాడు తూ ర్యాగింగ్ వార్త తమకు ఆలస్యంగా తెలిసిందన్నారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారని, తనకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. కాలేజీలో ర్యాగింగ్ వంటి చర్యలను అనుమతించబోమన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'15 నాటికి నివేదికలు ఇవ్వాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పర్యావరణ రక్షణకు సంబంధించిన ప్రణాళికలను ఈ నెల 15 నాటికి అందించాల ని అందజేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. పర్యావరణ రక్షణ ప్రణాళికపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్, సి – డి వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ ప్రణాళిక నివేదికలు జూలై 15 నాటికి అందజేయాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎంవీ పద్మావతి మాట్లాడుతూ సుప్రీం కోర్టు, ఎన్జీటీ ఆదేశాల మేరకు ప్రణాళిక తయారుచేయాలని కోరారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జలవనరులు గుర్తించి తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరెట్ సమావేశ మందిరంలో గ్రౌండ్ వాటర్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. భూమిలో నీటి నిల్వపై ఆరాతీశారు. సమావేశంలో జిల్లా భూగర్భ జల శాఖధికారి బి.రమణమూర్తి, కేంద్ర భూగర్భ జల శాస్త్రవేత్త జి.రవికుమార్, సీనియర్ శాస్త్రవేత్త జి.రవికుమార్, డీఎఫ్ఓ నిషాకుమారి, డీటీ గ్రౌండ్ వాటర్ బి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల డేటా అప్‌డేట్ చేయాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్టూడెంట్ ఇన్ఫో డేటా త్వరితగతిన అప్‌డేట్ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సంబంధిత శాఖల అధికారులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి నుంచి ఇంటర్, ఐ.టి.ఐ, పాలిటెక్నిక్‌కు వెళ్లే విద్యార్థుల వివరాలు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ http:studentinfo.ap.gov.in లింక్ ద్వారా డేటా అప్‌డేట్ వేగవంతం చేయాలని ఆదేశించారు. నేటికి యాభై శాతం పూర్తయ్యిందని, మిగిలినది కూడా పూర్తి చేయాలని తెలిపారు. డేటా ఎంట్రీ పూర్తయితే పథకాలు సులభంగా అందుతాయని అన్నారు. సమావేశానికి ఆర్‌ఐఓ దుర్గారావు, డీవీఓ ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.